సమగ్ర సర్వే 45 శాతం పూర్తి

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6లో సమగ్ర సర్వే 45 శాతం పూర్తయినట్లు డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 27752 ఇళ్ల సర్వే పూర్తయిందని ఇంకా 42 వేల ఇళ్లు ఉన్నాయన్నారు. ఇళ్ల వద్దకు వెళ్లినప్పుడు పనులకు వెళ్తుండటంతో అందుబాటులో లేకపోవడంతో మూసీ పరీవాహక ప్రాంతంలో నెమ్మదిగా సర్వే కొనసాగుతుందన్నారు.

కొనసాగుతున్న జీఐఎస్ సర్వే

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 ఛావుని డివిజన్‌లో గత రెండ్రోజులుగా జియలాజికల్ ఇన్ఫర్మేషన్ సర్వే కొనసాగుతుందని డీసీ జయంత్ తెలిపారు. డిజిటల్ ఇంటి నెంబర్ ఆర్డర్‌లో క్రమబద్ధీకరించడానికి ఈ సర్వే ఉపయోగపడుతందన్నారు. ఇళ్లకు అనుమతి, నల్లా కనెక్షన్, విద్యుత్ మీటర్, పన్ను వాటిని సర్వే చేస్తున్నారన్నారు.

రేపటి నుంచి వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా రోడ్డులోని హియర్ వెల్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఈ నెల 22 నుంచి 24 వరకు ఉచిత వినికిడి పరీక్షలు, చెవి మిషను ట్రయల్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు ఉచిత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మరిన్ని వివరాలకు 9703235513, 9985631926 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతు కారణంగా ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..

మూన్లీ స్కూల్, సీబీఐ క్వార్టర్స్, హదీ అమ్రీన్ మజీద్, ఓల్డ్‌మలక్‌పేట వాటర్ ట్యాంక్, జియా ఉల్ కా మజీద్, అబుబకర్ మజీద్, టీవీ స్టేషన్, మలక్‌పేట్, నెహ్రూనగర్, మస్కతీ పార్క్, రెయిన్‌బజార్ గ్రౌండ్, కార్నర్ టీ పాయింట్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 వరకు..

ఎస్‌ఆర్‌టీ కాలనీ, గాంధీ కా పుత్లా, మార్నింగ్ స్టార్, కమ్యూనిటీహాల్, టెంపుల్ పీటీ, అస్మత్‌నగర్ నాలా, ఇమాంబండ నాలా, వాహెద్‌నగర్, జెండా పీటీ, ఓల్డ్ మాతాం గట్టీ, వాహెద్‌నగర్ ఏటూజెడ్, అల్వాలా మజీద్, వాహెద్‌నగర్ న్యూ, జీఎంనగర్, కింగ్ హౌజ్ హోటల్, ధోబీఘాట్ లంబాడీ బస్తీ, ఒవైసీ హాస్పిటల్ మెయిన్‌రోడ్, జఫారియా మజీద్, పీఅండ్‌టీ కాలనీ కౌంటర్ చౌరస్తా, కమ్యూనిటీహాల్, కోదండరాం నగర్, హనుమాన్ టెంపుల్, వీవీనగర్, శారదా నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

సట్టా ఆడుతున్న ఇద్దరి రిమాండ్

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేటలోని రేస్‌కోర్స్ వద్ద సట్టా ఆడుతున్న ఇద్దరిని సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించగా రిమాండ్‌కు తరలించారు.

చెరువు కట్ట.. తెగితే ఎట్టా!

కుంగుతున్న ఫతుల్లాగూడ చెరువు కట్ట..
కానరాని వాకింగ్ ట్రాక్
మరమ్మతు చేయాలంటున్న స్థానికులు
పట్టించుకోని అధికారులు



నాగోలు: కాలమేదైనా నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ ఫతుల్లాగూడ చెరువు మాత్రం నీటితో కళకళ లాడుతుంది. చెరువులో పుష్కలంగా నీరు ఉండటం, పరిసర ప్రాంతాల్లో అటవీ ప్రాంతం ఉండడంతో పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. చెరువు చుట్టూ జీఎస్ఐ, ఫారెస్ట్ స్థలాలు ఉండంతో పచ్చడి చెట్లతో ఆకట్టుకుంటుంది. అయితే ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన చెరువు కట్ట కుంగిపోతోంది. నీటి ఒత్తిడికి



కంపచెట్లతో మూసుకుపోయిన వాకింగ్ ట్రాక్

తెగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. 14.20 ఎకరాలు ఉన్న ఈ చెరువు అభివృద్ధిపై ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే పర్యాటక ప్రాంతంగా మారుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కుంగిపోతున్న కట్ట..

ఫతుల్లాగూడ చెరువులో అలుగు భాగం గతంలో కొంతమేర కూలిపోవడంతో ఇరిగేషన్ అధికారులు అలుగును పూర్తిగా తొలగించి నూతనంగా గోడ తరహా నిర్మాణం చేశారు. దీంతో చెరువులోకి వచ్చిన వర్షం నీరు బయటకు వెళ్లకుండా ఉండి పోయింది. ఫతుల్లాగూడ చెరువుకు ఇతర ప్రాంతాల నుంచి, వర్షం నీరు రావడంతో నిండు కుండలా మారింది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ చెరువు కట్ట ప్రస్తుతం కుంగిపోతోంది. చెరువులోకి మరిన్ని నీరు వస్తే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. వెంటనే చెరువు కట్టకు మరమ్మతు చేసి లైట్లు, బెంబీలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కంప చెట్లతో వాకింగ్ ట్రాక్..

ఫతుల్లాగూడ చెరువు కట్ట దగ్గర గతంలో అధికారులు వాకింగ్ ట్రాక్ నిర్మాణం, అక్కడక్కడ బెంబీలు ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వాకింగ్ ట్రాక్‌లో కంప చెట్లు పెరిగి లోపలికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. అక్కడ పెరిగిన చెట్లను తొలగించి వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులో తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులు ఫతుల్లాగూడ చెరువుపై ప్రత్యేక శ్రద్ధ పెడితే పర్యాటక ప్రాంతంగా మారుతుందని ఆ దిశగా ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు, వివిధ కాలనీలవాసులు కోరుతున్నారు.



పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి..



ఫతుల్లాగూడ చెరువును కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కట్టకు మరమ్మతు చేయాలి. చెరువులో వర్షం నీరు ఉండడంతో చెరువు కట్ట, పరిసరాలను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రం తీర్చిదిద్దాలి. గతంలో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ పూర్తిగా కంప చెట్లతో నిండిపోయింది. వాటిని తొలగించి వాకింగ్ ట్రాక్ అందుబాటులో తీసుకురావాలి. చెరువుకు ఇరువైపులా పచ్చిక బయళ్లు, గార్డెనింగ్, అందమైన పూల మొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి. –కాటేపాక రవి, ఫతుల్లాగూడ

విద్యతోనే సమాజంలో గుర్తింపు



పుస్తకాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

మలక్‌పేట: విద్యతోనే బహుజనుల అభ్యున్నతి అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చాదర్‌ఘాట్‌లోని నింబోలి అడ్డ సాంఘిక సంక్షేమ బాలికల కాలేజీ హాస్టల్‌లో సోషలిస్టు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లైబ్రరీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు సమయం వృథా చేయకుండా గ్రంథాలయంలో ఎక్కువగా గడిపి, విజ్ఞానం సముపార్జన చేయాలన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తోందన్నారు. గ్రంథాలయం ఏర్పాటు చేసిన సోషలిస్టు విద్యార్థి సంఘం అధ్యక్షుడు నక్క వెంకటేష్, జనరల్ సెక్రటరీ ఏర్పుల శివలింగంను అభినందించారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య, నక్క వెంకటేష్, భూపాల్, వెంకటేష్, నరసింహా, శంకర్, రవి, మంద విజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం



అవార్డులు అందుకున్న కండక్టర్లు, డ్రైవర్లు

చైతన్యపురి: ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు రీజనల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. రీజనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు త్రైమాసిక ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎం మాట్లాడుతూ.. రీజియన్‌లోని డిపోలు నష్టాలబాట నుంచి లాభాల బాటలోకి వచ్చాయని, ఇందులో సిబ్బంది పాత్ర కీలకమన్నారు. రీజనల్ స్థాయిలో అర్హులైన వారందరికీ పెండింగ్ లేకుండా ప్రమోషన్లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు సుచరిత, జగన్, బాబునాయక్, దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ టి. సమత పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

బడంగ్‌పేట్: 57వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ వారోత్సవాలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 14 నుంచి 20వ వరకు వారంరోజుల పాటు నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ.. చిన్న వయసులోనే పిల్లలకు గ్రంథాలయాలకు వచ్చేలా అలవాటు నేర్పి, పుస్తక పఠనం, పోటీ పత్రికలను చదివేలా విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. పోటీ ప్రపంచంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచామని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సంపాదించి స్థిరపడాలని కోరారు. ఉద్యోగాల కోసం పోటీపడుతున్న విద్యార్థులు, నిరుద్యోగుల కోసం 150 మందికి ప్రతి రోజు రాత్రి ఉచిత భోజనం అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్, గ్రంథాలయ సిబ్బంది, స్థానిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

నాగోలు: నాగోలులోని ఈదమ్మ మాత తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప దేవతా పూజలు, అభిషేకం, పూర్ణాహుతి, కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం బోనాల సమర్పణ నిర్వహించారు. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆయనను సన్మానించింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ, చుక్కయ్య, శంకర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మధు, కార్తీక్, విజయ్, సంజీవ్, చైతన్య పాల్గొన్నారు.



పరామర్శకు వెళ్తే అరెస్టు చేస్తారా?



మాట్లాడుతున్న గోపినాయక్, జయరాం, దశరథ్ నాయక్

దిల్‌సుఖ్‌నగర్: లగచర్ల గిరిజన పేద రైతుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన గిరిజన సంఘం నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గోపినాయక్, జయరాం, దశరథ్ నాయక్ అన్నారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామాల గిరిజనుల దళితుల భూములను తీసుకోవడం అన్యాయమన్నారు. బాధిత రైతులను పరామర్శించడానికి వెళ్తే అరెస్టు చేయడం తగదన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నాగోలు: కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన సత్యనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ పైఅంతస్తులో రేకుల పైకప్పు మరమ్మతు చేయించాలని అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురా సంబంధిత అధికారులతో చర్చించి మరమ్మతుకు చర్యలు చేపడుతామన్నారు. ఈ సమావేశంలో కాలనీ అధ్యక్షుడు జయప్రకాష్, రమణ, రవీందర్, నగేష్, నాయకులు మంచి రాజేష్, తోట మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఏం సాధించారని విజయోత్సవ సభలు?



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో ఏం సాధించిందని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ ప్రశ్నించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏడాదిలో ఒక్క హామీ కూడా అమలు చేయలేదని దమ్ముంటే ఇచ్చిన హామీలన్నిటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఫార్మా పేరుతో రైతులపై అక్రమ కేసులు పెడుతున్నందుకా.. రైతు రుణ మాఫీ ఎగ్గొట్టినందుకా..పింఛన్లు పెంచుతామని చెప్పి తప్పినందుకా. లగచర్లలో ప్రజలను అవస్థలు పెడుతున్నందుకు విజయోత్సవ సభలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నగేష్, శ్రీనివాస్ రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, మంత్రి రవీందర్ రావు, వెంకటేష్ గౌడ్, కంచర్ల శేఖర్, జగన్, రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. పంజేషా క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, వీధి దీపాల నిర్వహణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సి పనులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.ఈ ఈ సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, అబ్దుల్ సలామ్ షాహిద్, జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్‌సింగ్, డీఈఈ శంకర్, వాటర్ వర్క్స్ డీజీఎం అస్మత్ అలీ, ఏఈలు, ఏరియా మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

- సైదాబాద్ మండల పరిధిలోని సైదాబాద్‌కాలనీ, శంకేశ్వర్‌బజార్, సపోటాబాగ్, పూసలబస్తీ, సలీంనగర్‌కాలనీ, మూసారంబాగ్‌బస్తీ, అఫ్జల్‌నగర్ ప్రాంతాలకు చెందిన 75 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

యోగా శిక్షకుడికి బంగారు పతకం

వనస్థలిపురం: రంగారెడ్డి జిల్లా యోగా శిక్షకుడు, వనస్థలిపురం నివాసి దత్త రాధమనోహర్‌కు జాతీయస్థాయిలో సీనియర్ బాయ్స్ విభాగంలో బంగారు పతకం, ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ అవార్డుతో పాటు నగదు బహుమతి లభించింది. ఇండియన్ యోగాసనా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలో ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ యోగా శిక్షకులు, యోగా సాధకులకు 14 పతకాలు వచ్చాయని తెలంగాణ అధ్యక్షుడు ఆచార్య సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి తుల్జాపూర్ వినోద్ తెలిపారు. అనేక రాష్ట్రీయ, జాతీయస్థాయి పోటీలలో బంగారు, రజత పతకాలు సాధించి తెలంగాణకు మంచి పేరు తీసుకువచ్చిన దత్త మనోహర్‌కు ఇటీవల ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ ఉద్యోగం వచ్చిందన్నారు.



దత్త మనోహర్‌కు ట్రోఫీ, నగదు అందజేస్తున్న నిర్వాహకులు

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు..
టమాట రూ. 33, వంకాయ రూ. 45, బెండ రూ. 40, పచ్చిమిర్చి రూ. 28, కాకర రూ. 20, బీర రూ. 40, క్యాబేజి రూ. 26, ఫ్రెంచి బీన్స్ రూ. 50, క్యారెట్ రూ. 60, దొండ రూ. 28, చిక్కుడు రూ. 60, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 53, క్యాప్సికం రూ. 65, ఆలు రూ. 36, దోస రూ. 28, సొర రూ. 15, పొట్ల రూ. 23, ఉల్లిగడ్డ రూ. 45, చామగడ్డ రూ. 35. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కనుల పండువగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్

మన్సూరాబాద్: కార్తీకమాసం పురస్కరించుకుని నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలోని విశాలాక్షి కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ దంపతులు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గణేష్ యాదవ్, అర్చకులు బాలమురళీశర్మ, కమిటీ నేతలు యాదగిరి, హనుమంతరావు, రమేష్, మురళీ, రవి, అశోక్, రమణమూర్తి, అజయ్, లక్ష్మయ్య, కేశవులు, రాందాసు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని కాపాడాలి

మీర్‌పేట: కబ్జా అయిన పార్కింగ్ స్థలాన్ని రక్షించాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి బుధవారం కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జనప్రియ మహానగర్‌లోని 5వ బ్లాకులో పార్కింగ్ నిమిత్తం కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేసి షెటర్లు నిర్మించి రియల్ ఎస్టేట్, ఓ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారని కమిషనర్‌కు వివరించారు. స్పందించి షెటర్లను తొలగించి పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి ఇప్పించేలా చొరవ తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



జలమండలి అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: నియోజకవర్గంలోని శివారు కాలనీలకు ప్రతి ఇంటికి తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని సమస్యలపై జలమండలి అధికారులతో సమావేశమై చర్చించారు. నియోజకవర్గంలో 30 సంవత్సరాల వరకు వరద ముంపు సమస్య లేకుండా ట్రంక్ లైన్లను అనుసంధానం చేయాలని సూచించారు. ట్రంక్ లైన్ పనులతో పాటు జలమండలి పనులనూ చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం రాజ్‌గోపాల్, మేనేజర్ శ్రీవాణి పాల్గొన్నారు.

వన భోజనాలు ఐకమత్యానికి దోహదం




నవజీవన్‌రెడ్డిని సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్

వనస్థలిపురం: వనభోజనాలు ఐకమత్యానికి దోహదపడుతాయని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక సమారాధన వనభోజనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, హరిప్రసాద్, జగన్నాథరావు, నరసింహారావు, యాదిరెడ్డి, హరినాథ్‌బాబు, సుబ్బారావు, ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు.

కంపు కొడుతోంది!

మ్యాన్‌హోళ్లు పొంగి రోడ్లపై మురుగు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథులే లేరని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధి నారాయణపురి కాలనీలో గత కొన్ని రోజులుగా మ్యాన్‌హోళ్లు పొంగి దారంతా మురుగు పారుతుందని సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.
–లింగోజిగూడ



‘హామీల అమలులో కాంగ్రెస్ విఫలం’



చంచల్‌గూడ: రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం కుర్మగూడ డివిజన్‌లో యాఖుత్‌పురా నియోజకవర్గం కన్వీనర్ బండా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో సహదేవ్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్‌ను మించి మోసం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నాడన్నారు. ఆరు గ్యారెంటీల్లో మూడింటికి పంగనామాలు పెట్టారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

ఆన్‌లైన్ మోసం.. రూ.94,636 మాయం

నాగోలు: ఆన్‌లైన్‌లో బట్టలు ఆర్డర్ చేసిన వ్యక్తి నుంచి రూ.94,636 నగదు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో నివాసముండే బైరం వెంకటేష్ స్థానికంగా బట్టల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 9 అతడికి వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన ఫోన్ నెంబర్ ఆధారంగా బట్టలు ఆర్డర్ చేయగా అవతలి వ్యక్తి ఫోన్‌పే ద్వారా నగదు చెల్లించాలని చెప్పడంతో వెంకటేష్ రూ. 5,500 పంపించాడు. కాసేపటి తర్వాత మరో వ్యక్తి ఫోన్ చేసి రూ. 6500 పంపాలనడంతో అవి కూడా పంపించాడు. ఇలా పలు దఫాలుగా రూ. 94,636 నగదు పంపించగా వాట్సాప్‌లో నకిలీ రవాణా రసీదు, నకిలీ డ్రైవర్ నెంబర్ పంపించారు. బాధితుడు ట్రాకింగ్ నంబర్ అడిగితే మరింత డబ్బులు కావాలని డిమాండ్ చేయగా మోసపోయినట్లు గ్రహించిన వెంకటేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.